నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

● ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. గురువారం శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని సెంట్రల్ పార్క్ ఫేజ్–2లో కోటి రూపాయల నిధులతో వేసిన సీసీ రోడ్డును కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని పేర్కొన్నారు.పెండింగ్ పనులను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాదాపూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, నాయకులు ప్రసాద్, రామకృష్ణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, గోపాల్‌యాదవ్, కాలనీవాసులు రమణి, భాస్కర్‌రెడ్డి, బాబురావు, భూపేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దేశ అభ్యున్నతిలో యువత కీలకం

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్

హఫీజ్‌పేట్ : దేశ అభ్యున్నతిలో యువతే కీలకమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం చందానగర్‌లోని క్రిస్టల్ గార్డెన్స్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో యువ ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. సమాజంలో మార్పు తీసుకురావాలంటే యువత ద్వారానే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నరేంద్ర రెడ్డి, కసిరెడ్డి సింధురెడ్డి, జిల్లా నాయకులు జితేందర్, నాయకులు రాంరెడ్డి, అమర్ యాదవ్, విష్ణు, విజయ్‌రెడ్డి, శివ, కిరణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్ఈపీ-2020ని అమలు చేయాలి

● ఎస్‌సీఈఆర్‌టీ హైదరాబాద్ ప్రొ.సురేష్‌బాబు


మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ప్రొ.ఇష్తియాక్ అహ్మద్

రాయదుర్గం: నూతన జాతీయ విద్యావిధానం –2020ని అంతటా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిందని ఎస్‌సీఈఆర్‌టీ ప్రొఫెసర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ విభాగం ఆధ్వర్యంలో ఉర్దూ మీడియం రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలలోని ప్రధానోపాధ్యాయులు, స్కూల్ ఎడ్యుకేషన్ అండ్ ప్రిన్సిపల్స్‌తో ఎన్ఈపీ–2020 అమలుపై ఒకరోజు రాష్ట్ర స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీక్షిత్ భారత్, ఉన్నత్ భారత్ అభియాన్ కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఇష్తియాక్ అహ్మద్ ప్రొఫెసర్ సిద్దిఖీమహ్మద్ మహమూద్, విద్యా, శిక్షణ విభాగాధిపతి ప్రొఫెసర్ షాహీన్ అల్తాఫ్ షేక్, డాక్టర్ నజ్మాబేగం, డాక్టర్ నౌషాద్ హుస్సేన్, ప్రొఫెసర్ అక్తర్ పర్వీన్ ప్రసంగించారు.

విశ్లేషణ, విమర్శనాత్మకంగా ఆలోచించాలి

● ఐఎస్‌బీ ప్రొ.దీపామణి

రాయదుర్గం: సంస్థలకు నాయకత్వం వహించేవారు విశ్లేషణాత్మకంగా, విమర్శనాత్మకంగా ఆలోచించాలని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ అండ్ డిజిటల్ లెర్నింగ్ డిప్యూటీ డీన్ ప్రొఫెసర్ దీపామణి సూచించారు. గచ్చిబౌలిలోని ఐఎస్‌బీలో ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో 'ఇన్నోవేట్ టు యాక్సిలరేట్' అనే థీమ్‌తో సీఎక్స్ఓ సమ్మిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విభిన్నంగా ఆలోచించే శక్తిని కలిగి ఉండాలని, వేగవంతమైన మార్పును కోరుకుంటూనే పరిస్థితులకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. భారత ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు డాక్టర్ వి అనంత నాగేశ్వరన్ మాట్లాడుతూ సాంకేతిక పురోగతులు, నైతిక వ్యాపార పద్ధతులకు అనుగుణంగా మారడం అవసరమన్నారు. ఈ సమావేశంలో ఐఎస్‌బీ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ అండ్ డిజిటల్ లెర్నింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుజాత కుమారస్వామి, పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాలల వార్షికోత్సవాలు


మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హఫీజ్‌పేట్ : మదీనాగూడ, పటాన్‌చెరు విజ్ఞాన్ గ్లోబల్ జెన్ స్కూల్స్ వార్షికోత్సవ వేడుకలు కొండాపూర్‌లోని విజ్ఞాన్ స్కూల్ ప్రాంగణంలో గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర పౌర సరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్‌పర్సన్ రాణి రుద్రమదేవి, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, చైర్మన్ లావు రత్తయ్యలు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్నత పదవులలో ఉండేలా విద్యార్థులను తీర్చిదిద్దిన ఘనత విజ్ఞాన్ విద్యాసంస్థలదే అని కొనియాడారు. విద్యా సంస్థల డైరెక్టర్ డా.సందీప్, క్రాంతికిరణ్,ప్రిన్సిపల్, కోఆర్డినేటర్లు, వైస్ ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంస్కృతి హైస్కూల్‌లో..



గచ్చిబౌలి: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదవాలని టీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర సూచించారు. కొండాపూర్ రాఘవేంద్ర కాలనీలోని సంస్కృతి హైస్కూల్‌లో జరిగిన వార్షిక వేడుకల్లో ఆయన మాట్లాడుతూ విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంత ముఖ్యమో తల్లిదండ్రుల పాత్ర కూడా ముఖ్యమన్నారు. కొండాపూర్ కార్పొరేటర్ షేక్ హమీద్‌పటేల్ మాట్లాడారు. పాఠశాల చైర్మన్ మంగళూరు లక్ష్మణ్, హైకోర్టు న్యాయవాది అనిల్‌కుమార్, నాయకులు రమేష్, స్కూల్ డైరెక్టర్ భవాని భార్గవి, ప్రిన్సిపల్ జ్యోతిర్మయి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్.. బాధితులకు రీఫండ్

రాయదుర్గం: ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు వచ్చిన 39 సైబర్ క్రైం కేసులలో బాధితులకు కోటి నలభై లక్షల రూపాయలను బాధితులకు రీఫండ్ చేశామని సైబరాబాద్ పోలీసులు తెలిపారు. సైబర్ మోసానికి గురయితే వెంటనే 1930కు ఫోన్ చేయాలని అధికారులు సూచించారు.

సీసీ కెమెరాలు ప్రారంభం

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని నవోదయ కాలనీలో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2లక్షల 80 వేల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసుకున్న 20 సీసీ కెమెరాలను గురువారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ ప్రారంభించారు.

త్యాగరాజ ఆరాధనోత్సవం

● ప్రతి రోజూ సాయంత్రం కచేరీలు, ప్రదర్శనలు
● జంటనగరాల సంగీత విద్వాంసులచే పంచరత్న గోష్టిగానం
● ముగింపు రోజు పాల్గొనున్న 1000 మంది కళాకారులు

మాదాపూర్: శిల్పారామంలో త్యాగరాజ ఉత్సవాలను సంస్కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. త్యాగరాజు కర్ణాటక సంగీత త్రిమూర్తులలో (ముత్స్వామి దిశితార్, శ్యామ శాస్త్రీ) ఒకరు. ఆయన త్యాగబ్రహ్మ పేరుతో ప్రసిద్ధిగాంచారు. నాదోపాసన ద్వారా భగవంతునని తెలుసుకోవచ్చని నిరూపించిన వాగ్గేయకారులు ఆయన. ఆయన జ్ఞాపకార్థం మూడురోజుల పాటు కొనసాగనున్న ఈ ఉత్సవాలలో ప్రముఖ వాగ్గేయకారులు తమ సంగీతంతో సందర్శకులను అలరించనున్నారు.

◆ సంస్కృతి ఫౌండేషన్ ద్వారా భారతదేశం, విదేశాలలో భారతీయ సంస్కృతి, కళలు, సాంప్రదాయాలను ప్రోత్సహించడానికి స్థాపించబడింది.
◆ ఫౌండేషన్ ద్వారా దక్షిణభారత శాస్త్రీయ సంగీతాన్ని బోధించడం, ప్రచారం చేయడం, సబర్మతీ సంగీత్, బృందావన్, ఆర్ట్, సహనా, విద్యాశ్రమం, కల్చరల్ రిట్రీట్ వంటి మరెన్నో కార్యక్రమాలను సంస్కృతి ఫౌండేషన్ నిర్వహిస్తుంది.
◆ శిల్పారామంలో మూడురోజుల పాటు సాయంత్రం సంగీత కార్యక్రమాలను నిర్వహించనున్నారు.
◆ ఏడు కార్యక్రమాలుగా.. 25 కచేరీలను నిర్వహిస్తున్నారు.
◆ జంటనగరాల నుంచి గురుకుల విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు.
◆ చివరిరోజు ఆదివారం పంచరత్న సేవా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.
◆ ఈ కార్యక్రమానికి జంట నగరాల నుంచి 1000 మంది కళాకారులు హాజరుకానున్నారు.
◆ యువ, అనుభవజ్ఞులైన కళాకారులు, ఔత్సాహికులు, వివిధ కళాసంఘాలు పాల్గొంటాయి.




సంగీతోత్సవంలో పాల్గొన్న భక్తులు (ఫైల్)

అలరించిన కర్ణాటక సంగీత కచేరీలు..

సాయంత్రం యాంపీ థియేటర్‌లో విద్వాన్ సు. దీర్‌శర్మ, విదూషీ సుబ్బులక్ష్మి, విద్వాన్ ప్రమోద్‌రెడ్డిలు తమ గాత్ర సంగీత వాయిద్యాలతో సందర్శకులను అలరించారు. వీరికి వయోలిన్ విద్వాన్ భట్టి పవన్ సింగ్, మృదంగం విద్వాన్ కృష్ణశ్రావణ్ కొప్పరపు, కంజీరా విద్వాన్ డాక్టర్ ఆర్. శ్రీకాంత్‌లు అందించారు.

26వ తేదీ..

విదూషి శ్రీయ మరెళ్ళపూడి, విద్వాన్ శేషం రమణ, విదూషి డాక్టర్ రామవరపు మాధురిదేవిలు సంగీత గాత్ర వాయిద్యాలతో అలరించనున్నారు. వీరికి వయోలిన్ విద్వాన్ కే.ఎల్ఎన్ మూర్తి, మృదంగం విద్వాన్ డీఎస్ఆర్ మూర్తి, విద్వాన్ విద్యాసాగర్, గాటం విద్వాన్ రవీంద్రతేజస్వీ, మార్సింగ్ విద్వాన్ ఘంటసాల సత్య.

27వ తేదీ..

ఎథ్నిక్‌హాల్‌లో జంటనగరాల నుంచి వచ్చిన విద్యార్థులు, గురువులు బృందావనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

28వ తేదీ ..

కార్యక్రమం ఆఖరురోజు ఎథినిక్‌హాల్‌లో నగర సంకీర్తన కార్యక్రమం ఉంటుంది. అలాగే గురు సన్మానం, పంచరత్నసేవ, గాత్రచిత్ర సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.



పాఠశాలలకు పార్కింగ్ సౌకర్యం తప్పనిసరి

సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్‌రావు


అవగాహన కార్యక్రమంలో డీసీపీ శ్రీనివాస్‌రావు తదితరులు

గచ్చిబౌలి: ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రతి పాఠశాల స్కూల్ బస్సుల కోసం పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలని, పార్కింగ్ వసతి లేకుంటే సమీపంలో స్థలాలను అద్దెకు తీసుకోవాలని సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్‌రావు సూచించారు. గురువారం మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలకు ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ రద్దీ, అవాంఛనీయ సంఘటనలు నివారించడానికి విద్యార్థులకు పికప్, డ్రాప్ పాయింట్లను ఏర్పాటు చేయాలన్నారు. బస్సులు నడిపే డ్రైవర్లకు తప్పని సరిగా హెవీ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఆయా రూట్లలో ఎదురయ్యే ట్రాఫిక్ సమస్యలను తమ దృష్టి తీసుకురావాలని పాఠశాలల యాజమాన్యాలకు సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ అడిషనల్ డీసీపీలు పి.శ్రీనివాస్ రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఏసీపీలు రణవీర్‌రెడ్డి, వెంకటయ్య, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై ర్యాలీ

● 'యముడి' వేషధారణతో వాహనదారులకు అవగాహన

రాయదుర్గం: రోడ్డుపై వేగంగా వెళ్లరాదని, ఇతర వాహనాలు, పాదచారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని లేనట్లయితే 'యమలోకం' ఖాయమని 'యమధర్మరాజు' వేషధారణలో మనోరంజన్ మాలిక్ వాహనదారులకు అవగాహన కల్పించారు. రాయదుర్గంలోని ప్రధాన రోడ్లపై 35వ రోడ్ సేఫ్టీ వీక్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా 400 మంది అపర్ణా నిర్మాణ సంస్థలోని అపర్ణా ఆక్వా ప్రాజెక్టుకు చెందిన కార్మికులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి వాహనదారుడిని రోడ్డుపక్కన ఆపి మరీ రోడ్డు భద్రత గురించి వివరించారు. అపర్ణా ఆక్వా సేఫ్టీ మేనేజర్ చంద్రకాంత్‌రెడ్డి, పీఎం ప్రాజెక్ట్స్ అరవింద్, కన్‌స్ట్రక్షన్ మేనేజర్ గజేంద్రమణి, సేఫ్టీటీమ్, హెచ్ఆర్ ఆఫీసర్ ఓబులేష్, అధికారులు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.


రాయదుర్గంలో వాహనదారుడికి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఓటరు అవగాహన ర్యాలీ

శేరిలింగంపల్లి/మాదాపూర్: శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉద్యోగులు, బీఎల్ఓలు, ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. అదే విధంగా మాదాపూర్‌లోని హైటెక్స్ నుంచి హైటెక్ సిటీ వరకు ఓటరు అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్ రెడ్డి, సర్కిల్ ఉప వైద్యాధికారి నగేష్‌నాయక్, ఏఎంసీ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వినతి

గచ్చిబౌలి: రంగారెడ్డి జిల్లా టీఎన్‌జీఓస్ కాలనీలో పోలింగ్‌బూత్‌ను ఏర్పాటు చేయాలని శేరిలింగంపల్లి సర్కిల్ ఉప కమిషనర్ రజనీకాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేసినట్లు ఆ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గడ్డం జంగయ్య తెలిపారు. టీఎన్‌జీవోస్ కాలనీ, మై హోం విహంగ, సచివాలయ కాలనీలలో 3 వేల ఓట్లు ఉన్నాయని, బూత్ ఏర్పాటు చేయాలని కోరారు. గౌలిదొడ్డికి వెళ్లి ఓటు వేస్తున్నామని ఓటర్ల సౌకర్యార్థం కొత్త బూత్ ఏర్పాటు చేయాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరులోని మైనారిటీ గురుకుల బాలికల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి ప్రవేశ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ హేనా మార్లిన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి ఇంగ్లిష్ మీడియంలో మొత్తం 80 సీట్లు ఉండగా అందులో ముస్లిం మైనారిటీ–51సీట్లు, మిగతా సీట్లు ఇతరులకు కేటాయించడం జరిగిందన్నారు.అలాగే ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ–40, బైపిసి–40 సీట్లకు గాను ముస్లిం మైనారిటీ 30, నాన్ మైనారిటీలు.. బీసీ–5, ఎస్సీ రెండు, ఎస్టీ రెండు, ఓసీ ఒకటి చొప్పున కేటాయించామని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా లేదా నేరుగా పాఠశాలలో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని ఎటువంటి ప్రవేశ రుసుము లేదని చెప్పారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ ఫిబ్రవరి 6 అని తెలిపారు.

మురుగు సమస్య పరిష్కారానికి కృషి

రాయదుర్గం: గోపన్‌పల్లి పెద్దచిన్న చెరువు వద్ద రోడ్డుపై మురుగునీరు పారకుండా తగిన చర్యలు చేపడతామని నీటిపారుదల విభాగం డీఈ నళిని అన్నారు. గోపన్‌పల్లి చిన్న పెద్ద చెరువు పరిసరాల్లోని స్కైవుడ్స్, హానర్ అపార్ట్‌మెంట్ల వైపు ప్రవహించడంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నామని వారు ఆమె దృష్టికి తీసుకురాగా గురువారం ఆ ప్రాంతాన్ని స్థానికులతో కలిసి పరిశీలించారు. చెరువు వద్ద నుంచి మురుగునీరు ఇటు వైపు రావడంతో దుర్వాసన, బురద ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆమె ఇతర శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్కైవుడ్ అసోసియేషన్ ప్రతినిధులు విద్యాధర్, శ్రీనివాస్‌రెడ్డి, పీబీరెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

సమష్టి సహకారంతో గ్రామాల అభివృద్ధి

పటాన్‌చెరు: ప్రజలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో ఒక కోటి 76 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం, మహిళా సమాఖ్య భవనం, అంబేద్కర్ యువజన సంఘం, బుడగ జంగాల సంక్షేమ సంఘం భవనాలను స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. త్వరలో రుద్రారం గ్రామంలో లాటిక్రేట్ సంస్థ సౌజన్యంతో 10 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఆధునిక వసతులతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాన్ని నిర్మించబోతున్నట్లు తెలిపారు. రుద్రారంలో నూతన భవనాల నిర్మాణాలకు ఒక కోటి 16 లక్షల రూపాయలు కేటాయించిన ఎంఎస్ఎన్ పరిశ్రమకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సుష్మా శ్రీ , జెడ్పీటీసీ సుప్రజా, గ్రామ సర్పంచ్ సుధీర్‌రెడ్డి, ఎంపీటీసీలు మన్నెరాజు, హరిప్రసాద్ రెడ్డి, ఎంపీడీఓ బన్సీలాల్, పంచాయతీరాజ్ డీఈ సురేష్, డీఎల్‌పీఓ సతీష్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పాండు, సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, గ్రామ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'దక్కన్' గురించి అధ్యయనం చేయాలి

'మనూ' వీసీ ప్రొ.ఐనుల్ హసన్

రాయదుర్గం: 'దక్కన్' ప్రాంతాన్ని అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని మనూ వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్(టీహెచ్‌సీ) రెండు రోజుల సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా టీహెచ్‌సీ ప్రొసీడింగ్స్‌ను, రెండు పుస్తకాలను వీసీ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దక్కన్ ప్రాంత మూలాలు, సూచనలు చాలా వరకు పర్షియన్ భాషలో ఉన్నాయని భాష, సాహిత్యం, చరిత్ర వంటి అంశాలు పరస్పర సంబంధం కలిగి ఉంటాయన్నారు. టీహెచ్‌సీ జనరల్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ రాధికాశేషన్ మాట్లాడుతూ దక్కన చరిత్ర గురించి ప్రస్తుతం తరానికి తెలియాల్సిన అవసరం ఉందన్నారు. దక్కన్ చరిత్రలోని వివిధ అంశాలపై పరిశోధన జరగాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ టీహెచ్‌సీ ప్రెసిడెంట్ సోషల్ సైన్సెస్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ కె అర్జున్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎం వీరేందర్ ,వివిధ విద్యా, పరిశోధనా సంస్థల నుంచి ఉపాధ్యాయులు, పరిశోధకులు, విద్యావేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హఫీజ్‌పేట్ : ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సరితారెడ్డి తెలిపిన ప్రకారం.. ఈ నెల 21వ తేదీ చందానగర్ హుడా కాలనీలోని శ్రీ లక్ష్మి గణపతి ఆలయం వద్ద ఓ వ్యక్తి (35) పడిపోయి ఉండడంను గమనించిన కానిస్టేబుల్ వెంటనే పోలీస్ పెట్రోలింగ్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు 108 అంబులెన్స్ వాహనంలో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఒంటిపై బ్లూ కలర్ జీన్స్, బ్లూ కలర్ చెక్స్ షర్ట్ ధరించి ఉన్నాడని, వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలన్నారు.